జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | మంగళవారం 14 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 156 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: అమావాస్య, వటసావిత్రి వ్రతం, జ్యేష్ఠ అమావాస్య గురుమౌఢ్యమి ప్రారంభం సూర్యోదయం: 5:34 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: లేదు । చంద్రాస్తమయం: 6:40 తిథి: అమావాస్య సా. 4:04 వరకు, తదుపరి పాడ్యమి, నక్షత్రం: పునర్వసు రా. 2:12 వరకు, తదుపరి పుష్యమి యోగం: వ్యాఘాతం మ. 2:00 వరకు, తదుపరి హర్షణ, కరణం: నాగవ సా. 4:04 వరకు, తదుపరి కింస్తుఘ్న రా. 2:56 వరకు, తదుపరి బవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528





# బాన్సువాడ దవాఖానలో ఐదుగురు బాలింతలకు అస్వస్థత

## నిజామాబాద్, హైదరాబాద్‌కు తరలింపు

## సిజేరియన్ వికటించడమే కారణం!

## విచారణ చేపడుతున్నట్లు సూపరింటెండెంట్ వెల్లడి

## ఆందోళనలో బాధిత



**బాన్సువాడ, జూలై 13:** పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల మాతా శిశు దవాఖానలో రెండురోజుల వ్యవధిలో ఐదుగురు బాలింతలు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. సిజేరియన్ ఆపరేషన్ వికటించి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో, వారిని నిజామాబాద్, హైదరాబాద్‌కు తరలించారు. దవాఖానలో శుక్ర, శనివారాల్లో పది మంది బాలింతలకు సిజేరియన్ ఆపరేషన్ చేశారు. ఇందులో ఎల్లారెడ్డికి చెందిన ఉమేర ఫాతీమా, బాన్సువాడకు చెందిన లక్ష్మీప్రియ, పిట్లం మండలం బండాపల్లికి చెందిన సునీత, గాంధారికి చెందిన జ్యోతి, బాన్సువాడ మండలంలోని కొత్తాబాదీకి చెందిన రుక్సానా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో ప్లేట్ లేట్ కౌంట్స్ పడిపోవడం, రక్త స్రావం జరగడంతో హుటాహుటిన దవాఖాన సిబ్బంది నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ నెల 10న ఉమేర ఫాతీమా, లక్ష్మీప్రియ, 11న సునీత, రుక్సానా, జ్యోతికి సిజేరియన్ చేయగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీరిలో ఉమేర ఫాతీమా, జ్యోతి , రుక్సానా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు పంపించారు. సిజేరియన్ అయిన పది మందిలో ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో బాధిత కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై బాన్సువాడ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా, పది మందికి సిజేరియన్ జరిగింది వాస్తవమేనని, అందులో ఐదుగురు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. సీజేరియన్ చేసిన అపరేషన్ థియేటర్‌ను పరిశీలించామని, అందులో ఉన్న మందులను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు.



వైద్య సేవలు అందించడంలో మంచిపేరు తెచ్చుకున్న బాన్సువాడ ప్రభుత్వ మాతా శిశు దవాఖానలో ఐదుగురికి వైద్యం వికటించడం వెనుక కారణాలు తెలియరావడంలేదు. సిజేరియన్ అనంతరం ప్లేట్ లేట్స్ పడిపోవడం, ఇన్‌ఫెక్షన్ సోకడం, రక్త స్రావం, అధిక రక్తపోటు వంటి కారణాలకు ఎవరు బాధ్యులో తేలాల్సి ఉన్నది.

# ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతన్నలు

## వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.



**బిచ్కుంద జులై 13 ( ప్రజాజ్యోతి )** రైతన్నలు తమ వ్యవసాయ క్షేత్రాల్లో హుషారుగా నారుమడులను పోసుకున్నారు. ఈ మధ్య కాలంలో అడపాదడపా వర్షం కురుస్తూ ఎండలు మండుతుంటే బోరు బావుల్లో నీరు లేక వేసిన వరి నాట్లు కోలుకోలేక కొందరు రైతులు బోరున విలపిస్తున్నారు. మరికొందరు తమ నారుమడులు ముదిరిపోతున్నా నాట్లు వేయలేక పోతున్నారు. వర్షాలు కురవాలని వరుణుడి కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లో గంగాజలాలతో నిత్యం గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్నారు. ఆలయాల్లో వర్షాలుసమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నీరంద కపోవడంతో ఎండిన పంటను చూసి పలువురు కన్నీరు పెడుతున్నారు. పంటను వదులుకోలేక పలు గ్రామాలకు చెందిన రైతలు పంటలకు నీటిని కొనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. కానీ అది సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు నీరందించలేక ఆశలు వదులుకున్నారు. మరి కొంద రు రైతులు సాగు చేసిన పంటలు కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు.వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గత 15 రోజులుగా వర్షం లేకపోవడంతో పంటలు ఎండిపోతుండడంతో రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. సరైన వర్షాలు లేకపోవడంతో చాలా మంది రైతులు ఇంకా విత్తనాలు వేయలేదు. కొందరు ధైర్యం చేసి విత్తినా పంట పలచగా - మిగతా2లో

# విద్యార్థినుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతులు అందించడం అభినందనీయం

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి

## బాలికలు చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించి అన్ని రంగాల్లో రాణించాలి

## దోమకొండ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నగదు బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి




# ప్రేమ మోసాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు యువత దూరంగా ఉండాలి



## మైనర్ డ్రైవింగ్ ప్రాణాంతకం... సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరం

## చిన్న పొరపాటు జీవితాన్ని నాశనం చేస్తుంది --

## విద్యార్థులకు పోలీసుల హితవు

## బిక్కనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం

# బోధన్ ప్రజావాణి కార్యక్రమంలో 8. దరఖాస్తులు..



**ప్రజా జ్యోతి బోధన్ జూలై 13..** బోధన్ ఆర్డీవో కార్యాలయంలో, బోధన్ డివిజన్ ఆర్డీవో మేడం గారు; డివిజన్ స్థాయి అధికారుల సమక్షంలో డివిజన్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 8 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. దరఖాస్తులు వచ్చిన విషయాలు: కుటుంబ భూ సమస్య, బోధన్ పట్టణం నందు మంచినీరు వృధా గురించి, డ్రైనేజీ సమస్య, ఇల్లు మ్యుటేషన్ మీద దరఖాస్తులు, పాస్ బుక్ ఇప్పించిన మీద దరఖాస్తులు మరియు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించుట గురించి

# రెండు ఇసుక ట్రాక్టర్ల ను పట్టుకున్న రూరల్ ఎస్సై రాజశేఖర్..



**ప్రజా జ్యోతి బోధన్ జులై 13..** సాలూర : మంజీర పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బోధన్ రూరల్ ఠాణా ఎస్ హెచ్ ఓ ఎం.రాజశేఖర్ సాలూర మండలం సాలంపాడ్ గ్రామ శివారులో సోమవారం ఉదయం పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించినట్లయితే జరిమానాలతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అక్రమ ఇసుక ను తరలిస్తున్న వారికి హెచ్చరించారు. ట్రాలీ ఆటోలలో రాత్రి పగలు అని తేడా లేకుండా అక్రమ ఇసుక తరలిస్తున్న వాటిపై చర్యలు తీసుకోకపోవడంపై మండలంలో తీవ్ర అనుమానాలకు దారి తీస్తుంది. 30 వరకు ట్రాలీ ఆటోలు ఇసుకను తరలిస్తున్నప్పటికీ పోలీస్,రెవెన్యూ యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ట్రాలీ ఆటోలే కాకుండా బొలెరో వాహనాలలో మంజీరా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక రవాణా యదేచ్ఛగా సాగుతుందని మంజీరా ప్రాంత గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ముడుపుల మాయాజాలంతోనే అక్రమ ఇసుక రవాణా యదేచ్ఛగా సాగుతుందని పలు గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొద్దిపాటి జరిమానాలు విధించడం వలన అక్రమ ఇసుక రవాణా సాగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాకు పోలీస్,రెవెన్యూ యంత్రాంగం కళ్లెం వేయలేకపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోబోతారో వేచి చూడాల్సిందే.

# ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతన్నలు

**-మొదటిపేజీ తరువాయి**



మొలకెత్తి, తగినంత తేమ లేక మొలకెత్తిన పంట ఎండ వేడికి వాడిపోతోంది. మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి వస్తుందేమోనని రైతులు భయపడుతున్నారు. బోర్లు ఉన్నవారు పంట కాపాడుకునే ప్రయత్నం..
బోరు సౌకర్యం ఉన్న రైతులు స్ప్రింకరు, రైన్ పైపులతోపంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ వర్షంపైనే ఆధారపడే అధిక శాతం రైతులు మాత్రం ఆకాశం వైపు చూస్తూ కూర్చోవాల్సిన పరిస్థితి. అప్పుల భారంతో ఆందోళన.. విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు. వర్షం లేక పంట చేతికి రాకపోతే పెట్టుబడి కూడా రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అప్పుల్లోనే మునిగిపోతామేమోనన్న ఆందోళన రైతుల్లో మొదలైంది. దేవుళ్లకు మొక్కులు..
కొన్ని గ్రామాల్లో రైతులు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వర్షం కోసం పండుగలు జరుపుకుంటున్నారు.

**కామారెడ్డి జిల్లా వాతావరణ గణాంకాలు..**

ఉష్ణోగ్రతలు: గరిష్టం 32డిజ నుంచి 35.9డిజ. మెనూర్లో అత్యధికం 35.9డిజ, రామారెడ్డిలో 35.5డిజ. కనిష్టం 23డిజ నుంచి 27.3డిజ. గా ఆదివారం ఉన్నాయి.

వర్షపాతం: ఈ సీజన్ సంచిత వర్షపాతం 172.8 ఎంఎం. సాధారణం 230.9ఎంఎం. 25.0శాతం కొరత తో" డిఫరెంట్గా ఉంది

మండలాల వారీ స్థితి..

అధికం: భిక్నూర్ ం39.0శాతం

సాధారణం: జుక్కల్, బీర్కూర్, నసురుల్లాబాద్, సదాశివనగర్, కామారెడ్డి, రామారెడ్డి, దోమకొండ, పాల్వంచ

కొరత: మద్నూర్, పెద్దకొడ్పగల్, బిచ్కుంద, బాన్సువాడ, పిట్లం, నిజాంసాగర్, యెల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, తాడ్వాయి, రాజంపేట, మాచారెడ్డి, బీబీపేట, దొంగ్లి, మొహమ్మద్నగర్

తీవ్ర కొరత: నాగిరెడ్డిపేట -61.0శాతం

జిల్లాలోని 25 మండలాల్లోనూ కావాల్సినంత వర్షం నమోదు కాలేదు. వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ పంటలకు ఇబ్బందులు తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థినుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతులు అందించడం అభినందనీయం

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 13 (ప్రజా జ్యోతి):**

విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో విద్యాపై మరింత ఆసక్తి పెరుగుతుందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నగదు బహుమతుల ప్రదానోత్సవం, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్య అనేది జీవితాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాకుండా విజ్ఞానం, నైపుణ్యాలు, క్రమశిక్షణ, విలువలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయికి చేరుతున్నారని, అందుకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. శ్రీరామ్ చిట్స్ సంస్థ విద్యార్థినుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతులు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్ల విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తారని తెలిపారు. విద్యార్థుల విజయాలను సమాజం గుర్తించి గౌరవించడం ద్వారా ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తి లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు విద్యను ఆయుధంగా చేసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం, ఒక సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, వివక్ష వంటి సామాజిక సమస్యలను అధిగమించేందుకు విద్యే ప్రధాన మార్గమని అన్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి బాలికలు పెద్ద కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడి చదవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యంగా బాలికల విద్య విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని అన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిబద్ధతతో బోధన అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళు న్నారని అభినందించారు. గత విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను సభలో ఘనంగా సన్మానించారు. విద్యార్థినుల విజయాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు, విద్యాశాఖ అధికారులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు

# ప్రేమ మోసాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు యువత దూరంగా ఉండాలి

**కామారెడ్డి ప్రతినిధి, జూలై 13 (ప్రజా జ్యోతి):** యువత దేశ భవిష్యత్తు అని, విద్యార్థి దశలో తీసుకునే ప్రతి నిర్ణయం వారి జీవితాన్ని తీర్చిదిద్దుతుందని, తాత్కాలిక ఆకర్షణలు, చెడు అలవాట్లు, సోషల్ మీడియా మోజు, ప్రేమ పేరుతో జరిగే మోసాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అంశాలకు దూరంగా ఉంటేనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని కామారెడ్డి జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం బిక్కనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సబ్-ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక సమస్యలు, యువత భద్రత, మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మానవ అక్రమ రవాణా, మైనర్లపై జరిగే నేరాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, ప్రస్తుతం యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర యాప్‌లలో గడుపుతున్నారని, అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత ఫొటోలు, బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డులు పంచుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉందన్నారు. డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ లేదా ఇతర సమస్యలు ఎదురైతే షీ టీమ్ -- 8712686094ను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు కాల్ చేయాలని వివరించారు. ప్రేమ పేరుతో మోసాలు చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాలను గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. తల్లిదండ్రులకు తెలియకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, అపరిచితుల మాటలు నమ్మి జీవితాన్ని ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు. చిన్న వయసులో భావోద్వేగాలకు లోనై తీసుకునే తప్పు నిర్ణయాలు జీవితాంతం బాధించే పరిస్థితులు తీసుకురావొచ్చని చెప్పారు. మైనర్ డ్రైవింగ్ చట్టవిరుద్ధమని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని, వాటికి దూరంగా ఉండటం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని వివరించారు. విద్యార్థులు తమ సమయాన్ని చదువు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసానికి వినియోగించాలని, చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లపై జరుగుతున్న నేరాలు, బాలల హక్కులు, మహిళల భద్రత, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై కూడా విద్యార్థులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషరావు, పోలీస్ కానిస్టేబుళ్లు ప్రభాకర్, సాయిలు సామాజిక సందేశాలతో కూడిన పాటలు, నాటికలు, సంభాషణల ద్వారా విద్యార్థులను ఆకట్టుకున్నారు. వినోదంతో పాటు విలువైన సందేశాలను అందిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. మానవ అక్రమ రవాణా నియంత్రణపై కానిస్టేబుల్ రాజేందర్ ప్రత్యేక అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మణి రాధాదేవి మాట్లాడుతూ, విద్యార్థులు పోలీసుల సూచనలను జీవితంలో ఆచరిస్తే సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. కళాశాల మోటివేటర్, ఫిజికల్ డైరెక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవీందర్, బ్లూ కోట్స్ సిబ్బంది, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ నేరాలకు దూరంగా ఉండాలని, భద్రమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**ఇందల్వాయి. ( ప్రజా జ్యోతి )** ఇందల్వాయి, జూలై 13: ఇందల్వాయి మండల కేంద్రంలోని తీర్మానపల్లి సబ్ సెంటర్ పరిధిలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి ఆరోగ్య సూచనలను వివరించారు. అనంతరం అర్హులైన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించి, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వాటిని మింగించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ శారద, ఆయమ్మతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# నులిపురుగుల నివారణ కై ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ




**రెంజల్, జులై 13(ప్రజాజ్యోతి ):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహిస్తున్న "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవశీ"కార్యక్రమాన్నీ పురస్కరించుకొని రెంజల్ మండల కేంద్రం లోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ రెంజల్ పాఠశాలనందు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు జులై 13 వ తేదీ ఈ రోజున జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అందజేయడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడుతుందనీ అన్నారు. ప్రధానంగా ఏ లిక పాములు కొంకిపురుగులు, నులిపురుగులు, వల్ల విద్యార్థులలో రక్తహీనత, అలసట, కడుపులో నొప్పి, డయేరియా, డీసెంట్రీ, లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కాబట్టి ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రను బాగా నమిలి చప్పరించాలన్నారు. భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులు శుభ్రత పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోష కాహారము, వ్యక్తిగత పరిశుభ్రత,వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు చేతివేళ్ల గోళ్లశుభ్రతను పాటించాలన్నారు, అమ్మాయిల్లో రక్తహీనత 12 గ్రాములకు మించి ఉండాలని, ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈరోజు ఆల్బన్ డాజోల్ మాత్రలు తీసుకొని వారు జూలై 20వ తేదీ రోజు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు,కరిపే రవీందర్, సురేష్,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి ఆర్డీఓ.

**రెంజల్ మండలంలో విజయ కుమారి పర్యటన..**

**నివేదికలపై కీలక ఆదేశాలు.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.**



**రెంజల్, జులై 13(ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వేగవంతం చేయాలని బోధన్ ఆర్డీఓ విజయ కుమారి ఆదేశించారు. సోమవారం ఆమె రెంజల్ మండలంలోని సాటాపూర్, కునేపల్లి గ్రామాలలో పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మరియు రికార్డులను పరిశీలించారు. ?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలనాపరమైన పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందేలా చూడడమే అధికారుల ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ నివేదికల సమర్పణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి నివేదికకు ఒక నిర్దిష్ట కాలపరిమితిని విధించుకుని, ఆ లోపు పనులను పూర్తి చేయాలి.

సాంకేతికత వినియోగం: పనుల్లో వేగం పెంచేందుకు వీలైనంత వరకు ఆన్‌లైన్ డిజిటల్ పద్ధతులను ఉపయోగించుకోవాలి.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణ:**

పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఈ కార్యక్రమంలో సర్పంచులు లచ్చావార్ సుహాసినినితిన్, మల్లేష్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ గౌతమ్, జీపీఓ ఈశ్వర్,ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, బి ఎల్ ఓ లు,వివిధ విభాగాల అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్ట్

**హుజురాబాద్:** హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముత్తోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగు తుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవింవారన్నారు. ఇదే విషయమై మళ్లి గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముత్తోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని




ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయ స్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నా మన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

# మణుగూరు ప్రధాన రహదారిపై భారీ గుంతలు వెంటనే పూడ్చాలి
## జిల్లా కలెక్టర్‌కు మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ వినతి

**భద్రాద్రి కొత్తగూడెం :** మణుగూరు పట్టణ ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను అత్యవసరంగా పూడ్చడంతో పాటు శాశ్వతంగా నాణ్యమైన బీటీ (ఖ) రహదారి నిర్మాణం చేపట్టాలని మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ జిల్లా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మణుగూరు ప్రధాన రహదారిలో సురక్ష బస్ స్టాండ్ సమీపంలోని గిరిజన స్టోర్ ఎదురుగా, అంబేద్కర్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో, అశోక్‌నగర్ పెట్రోల్ బంక్ ముందు రహ దారి పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి పట్టణంలో అత్యం త రద్దీగా ఉండే ప్రధాన మార్గమని, ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, విద్యా ర్థులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, అత్యవసర సేవల వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనా లు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయని తెలిపారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవ డం, ఆటోలు, కార్లు ఇతర వాహనాలు ప్రమాదాలకు గురవడం తరచుగా జరుగు తోందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంద ని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు గాయపడగా, భవిష్యత్తులో



ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉన్నందున సంబం ధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆమె కోరారు. భారీ గుంతలను అత్యవ సరంగా పూడ్చి వేయడంతో పాటు శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన బీటీ రహదారి నిర్మించాలని, మరమ్మతులు పూర్తయ్యే వరకు హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించి నివేదిక సమర్పించే లా ఆదేశాలు జారీ చేయాలని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ను దుర్గ కోరారు.

# ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

**మంచిర్యాల :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అవగాహన పోస్టర్లలో మీ ఓటు మీ బాధ్యత అనే నినాదంతో కొత్త ఓటరు నమోదు పేరు తొలగింపు వివరాల సవరణ పోలింగ్ కేంద్రం మార్పు డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ జూలై 24తో ముగుస్తుందని ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకునే



అర్హులు అలాగే పేరు చిరునామా ఇంటి నంబర్ వయస్సు ఫోటో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను కూడా ఈ సర్వే ద్వారా పూర్తి చేసుకోవచ్చని ఎమ్మెల్యే వివరించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అవుతుందని అనంతరం అభ్యంతరాలు సవరణలకు ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 31న విడుదల కానుందని వెల్లడించారు ఈ సర్వే ప్రక్రియ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్న ఎమ్మెల్య రేషన్ కార్డులు పెన్షన్లు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను కూడా ప్రజలు సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సర్పంచులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఎస్ఐఆర్ సర్వే పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని రాజకీయాలకు అతీతంగా ప్రజాహిత దృక్పథంతో సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మేయర్ దర్నీ మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్య నారాయణ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జెల హేమలత ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్

**హైదరాబాద్ :** స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఆన్-డివైస్) ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి జఖఎ పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు. యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి. ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది."బయోమెట్రిక్ విధానానికి పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, యూపీఐ వినియోగదారులు సులభమైన, వేగవంతమైన పేమెంట్ అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది. జూన్ నెలలోనే రికార్డు స్థాయిలో 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం విశేషం. రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐతో సహా అన్ని రకాల చెల్లింపుల్లోనూ ఈ విధానానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ కస్టమర్లకు బయోమెట్రిక్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ఈ పద్ధతిని ఎంచుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాము" అని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా అన్నారు. స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ లాక్ వాడటం ద్వారా, వినియోగదారులకు యూపీఐ పిన్ గుర్తుపెట్టుకోవాల్సిన లేదా ఎంటర్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది లావాదేవీలను చాలా వేగంగా పూర్తి చేయడమే కాకుండా, పేమెంట్లు ఫెయిల్ అవ్వకుండా సక్సెస్ రేటును పెంచుతుంది. వివిధ బ్యాంకులు, యూపీఐ యాప్ లలో ఈ సదుపాయం విస్తరిస్తుండటంతో, భారతీయుల రోజువారీ చెల్లింపుల శైలిలో బయోమెట్రిక్ కీలక పాత్ర పోషించనుంది. రాబోయే నెలల్లో కూడా ఈ ఫీచర్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని ఎన్‌పీసీఐ ఆశిస్తోంది. ఇది సురక్షితమైన, ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది

## ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా "ట్రినిటీ ఐడియా పిచ్ అరేనా"



**పెద్దపల్లి :** పట్టణంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో "ట్రినిటీ ఐడియా పిచ్ అరేనా" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ, పల్లవి, మల్లారెడ్డి యూనివర్సిటీ, జ్యోతిష్మతి, ఐఐటిసి తదితర ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని సుమారు 100 వినూత్న ప్రాజెక్ట్ ప్రతిపాదనలు సమర్పించా రు. సమాజానికి ఉపయోగప డే నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాలను విద్యార్థులు ప్రదర్శించగా, నిపుణులైన జడ్జీలు పారదర్శకంగా వాటిని పరిశీలించి మూల్యాంకనం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు బృందాల కు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అ లాగే మెరిట్ జాబితాలో ఎంపికైన వినూత్న ఆలోచనలను భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎం ఎస్ ఎంఈ ఐడియా హాకతోన్ 6.0కు సిఫారసు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డా. అశోక్ కుమార్ వూట్ల మాట్లాడుతూ, తమ కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ దాసరి మమతారెడ్డి ఆధ్వర్యంలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవలే భారత ప్రభుత్వ ఎం ఎస్ ఎంఈ శాఖ ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్ మంజూరైందన్నారు. విద్యార్థు ల్లో ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేందు కు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆవిష్కరణలకు ట్రినిటీ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా భారత ప్రభుత్వ సహకారంతో రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా. మణి గణేష్, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ శ్రీ అశోక్ ప్రభాకర్, జడ్జిలుగా డా. కౌండిన్య, డా. సమ్మ య్య , డాక్టర్ రామ్మోహన్, విద్యాసాగర్ సుప్రియ, భాష, మరియు విభాగ అధిపతులు పాల్గొని విద్యార్థులకు విలువై న సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాప కులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం లభ్యం..



**జమ్మికుంట,** సోమవారం తేదీ 13-07 ఉదయం ఒక గుర్తు తెలియని వృద్ధుడు వయసు సుమారు 60-65 సంవత్సరాలు. బిసుగిరిషరీఫ్-జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య దిగువ లైన్లో వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ క్రింద పడి ఆత్మ హత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం అవుతుంది. మృతుడు లేత పింక్ కలర్ టీ షర్ట్, నలుపు రంగు నెక్కర్ దానిపై తెలుపు గీతల డిజైన్ గలది ధరించి ఉన్నాడు మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు గాని వస్తువులు గాని లేవని మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ లో భద్రపర్చినట్లు .ఈ కేసును రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జీ తిరుపతి, విచారణ చేస్తున్నట్టు తెలిపారు. మృతుని గురించి ఏమైనా వివరాలు తెలిసినచో ఫోన్ నెంబర్ 9949304574, 8712658604 కి సమాచారం ఇవ్వాలని జీ తిరుపతి, పత్రిక సమావేశంలో తెలిపారు..

# ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

**జూలై 15న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపు**




**తాండూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం తాండూరు మండల కార్యదర్శి దాగం రాజారాం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తాండూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి ఉన్న దేశంగా భారత్ ఉన్నప్పటికీ యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుండగా ప్రభుత్వాలు మాత్రం యువత ఆశలతో రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అలాగే తెలంగాణలో కూడా ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీలు అమలు కాలేదని, నోటిఫికేషన్లు ఆలస్యమవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయాలని, కేంద్ర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీస్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని, డీఎస్సీ, గ్రూప్స్, జేఎల్, డీఎల్ తదితర అన్ని శాఖల్లో నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవీపీఎస్ తాండూరు మండల కార్యదర్శి దుర్గం నాన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు బొల్లం రాజేశం, మొగిలి, రాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ కై ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ



**నిజామాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహిస్తున్న "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవనీ" కార్యక్రమాన్నీ పురస్కరించుకొని ఈరోజు మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే హైస్కూల్ నందు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ని అడిషనల్ కలెక్టర్ శ్రీ భుజంగరావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు జులై 13 వ తేదీ ఈ రోజున జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అందజేయడం జరుగుతుం ది అని అన్నారు. విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడుతుందనీ అన్నారు. ప్రధానంగా ఏ లిక పాములు కొంకిపురుగులు, నులిపురుగు లు, వల్ల విద్యార్థులలో రక్తహీనత, అలసట, కడుపులో నొప్పి, డయేరియా, డీసెంట్రీ, లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కాబట్టి ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు విద్యార్థులం దరూ ఆల్బెండజోల్ మాత్రను బాగా నమిలి చప్పరించాల న్నారు. భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులు శు భ్రత పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోష కాహారము, వ్యక్తిగత పరిశుభ్రత,వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన మొత్తం ఒకటి నుండి 19 సంవత్సరాల విద్యార్థులు 390297 మంది ఉన్నారన్నారు. విద్యార్థులు చేతివేళ్ల గోళ్ల శుభ్రతను పాటించాలన్నారు, అమ్మాయిల్లో రక్తహీనత 12 గ్రాములకు మించి ఉండాలని, ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈరోజు ఆల్బన్ డాజోల్ మాత్రలు తీసుకొని వారు జూలై 20వ తేదీ రోజు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, రీజనల్ కోఆర్డినేటర్ సత్య నాథ రెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రిన్సిపాల్ స్వప్న ,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, , వైద్యాధికారులు డాక్టర్, రాజశ్రీ ,డాక్టర్ అజ్మల్, డాక్టర్ అరవింద్, డిప్యూటీ డెమో దుర్గారావు,డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డి ఈ ఐ సి మేనేజర్ సచిన్, సి హెచ్ ఓ గిరిబాబు, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు కిషన్ ,ప్రమీల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అమరావతి ఈఎంఎస్ సంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను ఇవ్వడం అభినందనీయం..**

**అమరావతి ఈఎంఎస్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు**



**సూర్యాపేట :** కోదాడ మండలం రెడ్లకుంట గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం సంస్థలోని ఉత్పత్తి విభాగాలు,యంత్రాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కోదాడ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసిన వై. అనంతరావు, వై. కరాళ్ బోస్, డాక్టర్ స్టాలిన్లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమ మరింత అభివృద్ధి చెంది స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులతో సంస్థ మంచి గుర్తింపు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ నిర్వాహకులు చైర్మన్ వై అనంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కారల్ బోస్, సీఈఓ డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీ రింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కార్యదర్శి, కరస్పాండెంట్ కె. కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, సంస్థ సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 156 ఫిర్యాదులు

**నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 156 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్ ఓటర్‌పై బిఎల్‌ఓ లతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే:



**రామడుగు :** గోపాలరావుపేట గ్రామంలో సర్ ఓటర్పై (బిఎల్ఓ) లతో మాజీ శాసనసభ్యులు సుంకే రవి శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రవి శంకర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పైన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని టైం లేనందున ప్రజలకు ఇప్పుడిప్పుడే దీనిపై అవగాహన వస్తున్నందున మరికొంత సమయం పొడిగించాలని గ్రామంలో ఏదైనా ఓటర్ల వివరాలు ఇతర ఇబ్బందులు ఉంటే మా పార్టీ తరఫున మేము నియమించుకున్న బిఎల్ఏ మరియు బిఎల్ ఓ వాళ్లను సమన్వయం చేసుకొని ఏ ఒక్క ప్రజల ఓటు కూడా పోకుండా తొందరగా ఆన్లైన్ పూర్తి చేయాలని గ్రామ కార్యదర్శి కి బిఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం

**కూకట్ పల్లి :** ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్ డివిజన్ గ్రీన్ వ్యూ కాలనీలో స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన రమేష్ విస్తృతంగా పర్యటించారు. తాము నివసించేందుకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు రోడ్లు విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు దీనిపై స్పందించిన ఆయన కొద్దిరోజులు వ్యవధి లోనే కాలనీకి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం సర్ పత్రాల పంపిణీ పైన వాటిని పూర్తి చేయడం పైన ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పత్రాన్ని పూర్తి చేసి తిరిగి అధికారులకు అందజేయాలని సూచించారు పార్టీకి చెందిన స్థానిక నాయకులు సైతం సర్ పత్రాలను పూర్తి చేయడంపై ప్రజలకు సహకరించాలని సూచించారు.

## ఎస్ఐఆర్ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం

**రంగారెడ్డి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గోన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ఓట్లు పోవ్వకుండా జాగ్రత్త పడాలి. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేసే విధంగా ఈ కార్యక్రమం వుందని అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకే ఓట్లు తొలగించే డ్రామా ఎస్ఐఆర్. గడపగడపకు తిరిగి వివరాలు సేకరించవలసిన అధికారులు ఒకే చోట ఖీ ఫారంలు పంచుతున్నారు. అధికారులు వచ్చిన సమయంలో ఇంట్లో లేకపోతే వాళ్ళ ఓట్లు తొలగించే పన్నాగం పడుతున్నారు అధికారులు. అధికారులు సైతం కాంగ్రెస్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు . అధికారుల ధోరణి మారకపోతే న్యాయస్థానానికి వెళ్ళి పిర్యాదు చేశాం. బిఆర్ఎస్ కార్యకర్తలు బీఎల్వో లతో కలిసి ఓట్లు తొలగించకుండా వివరాలు సేకరించేలా పనిచేయాలని అన్నారు.

## భయమా..ప్రకాష్ రాజ్ ?

**హైదరాబాద్ :** యూట్యూబర్ రావణ్ దేశద్రోహం, ఉపా చట్టం కింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఉదంతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ పేరు ప్రముఖంగా తెరపైకి రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై పెద్ద ఎత్తున ట్రోలింగ్, ప్రచారం మొదలైంది. దీనిపై ప్రకాష్ రాజ్ నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరంటూ కొత్తగా వీడియో విడుదల చేశారు. తాను మౌనంగా లేనని, జనసైనికులు, కొన్ని ఛానళ్లు, యూట్యూబర్లు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని గమనిస్తున్నానని తెలిపారు. వీటన్నిటికీ దిగజారండి, దిగజారుతూనే ఉండండి అని వ్యాఖ్యానిస్తూ, వారి దిగజారుడుతనాన్ని ప్రపంచం చూస్తోందంటూ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ పైపైన ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నా.. లోపల మాత్రం కేసు తీవ్రత చూసి తీవ్ర ఆందోళనలో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దేశద్రోహం కేసులో ఇరుక్కున్న రావణ్‌తో ప్రకాష్ రాజ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. రావణ్‌తో పాటు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి, ఏపీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యూహాత్మక కుట్రలు చేశారనే ప్రచారం గట్టిగా నడుస్తోంది. గతంలో రావణ్ చేసిన పలు వివాదాస్పద పోస్టులను, వీడియోలను ప్రకాష్ రాజ్ సపోర్ట్ చేస్తూ రీట్వీట్లు చేయడం.. ఇప్పుడు ఈ విచారణ తన దాకా వస్తుందనే భయంతోనే ఆయన ప్రశ్నించే గొంతు అంటూ ముందస్తు రక్షణ కవచం వెతుక్కుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకాష్ రాజ్ కెరీర్ అంతా పరిశీలిస్తే.. ఆయన ఎప్పుడూ సమాజం కోసమో, సామాన్య ప్రజల సమస్యల కోసమో క్షేత్రస్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు లేవనేది బహిరంగ రహస్యం. ఆయన వేసే ప్రశ్నలు కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసేలా, ఆయన వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు ఉపయోగపడేలా మాత్రమే ఉంటాయనే వాదన బలంగా ఉంది. అందుకే ప్రజాసమస్యలపై స్పందించని ఆయన ప్రశ్నల ను సామాన్యులు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈసారి వ్యవహారం కేవలం రాజకీయ విమర్శలతో ఆగిపోయేలా లేదు. ప్రభుత్వ నిఘా వర్గాలు, పోలీసులు ఈ డిజిటల్ కుట్రల వెనుక ఉన్న అసలు లింకులను పక్కా ఆధారాలతో బయటకు తీస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే కాబట్టి, నిజాలు పూర్తిగా నిరూపితమైతే ప్రకాష్ రాజ్ సైతం లీగల్ చిక్కులను, కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి అడుగులు ప్రకాష్ రాజ్ మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. అరెస్ట్ అయిన రావణ్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో లభ్యమైన కీలక డేటా, చాటింగ్ హిస్టరీతో పాటు.. ఈ ఛానల్‌కు ఫండింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గమన అనే మహిళను పోలీసులు త్వరలోనే విచారించనున్నారు. గమన నోటీసుల విచారణలో తేలే అంశాలు, రావణ్ ఫోన్ డాక్యుమెంట్లు క్రోడీకరిస్తే.. ఈ సోషల్ మీడియా నెట్‌వర్క్ వెనుక ప్రకాష్ రాజ్ పాత్ర ఏంటనేది అధికారికంగా బయటపడే అవకాశం ఉంది. తెరవెనుక నడిచిన అసలు కథ స్క్రిప్ట్ బయటకు వస్తే, అది ప్రకాష్ రాజ్ కే సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

## ఆరు రోజుల పాటు కూనారం రోడ్ గేటు మూసివేత

**పెద్దపల్లి :** పెద్దపల్లి రైల్వే యార్డు సమీ పంలోని లెవల్ క్రాసింగ్ నెం.39 వద్ద అత్యవసర ట్రాక్ మరమ్మతుల పనుల కారణంగా నేటి నుండి ఈ నెల 19 సాయంత్రం 7 గంటల వరకు గేట్‌ను రోడ్డును మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ సమయంలో వాహనదారు లు ప్రత్యామ్నాయ మార్గాల ను వినియోగించాలని సూచించారు. మరమ్మతుల వల్ల కలిగే అసౌకర్యానికి రైల్వే శాఖ విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రహదారిపైన ఇసుక లారీల పార్కింగ్‌పై కలెక్టర్ కు ఫిర్యాదు.



**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాళేశ్వరం?మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వందలాది ఇసుక లారీలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ వినతిలో పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై భారీ లారీలు గంటల తరబడి నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు, పాఠశాల వాహనాలు, అత్యవసర సేవల కోసం వెళ్లే అంబులెన్స్‌లు సైతం సకాలంలో ప్రయాణించలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రజల ప్రాణాలు, భద్రత దృష్ట్యా ప్రధాన రహదారిపై ఇసుక లారీల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించి, ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సర్పంచ్ సరిత కోరారు. గ్రామ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం

# డిఫెన్స్ రంగంలోకి భారత్

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది. భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి.ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది. కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# రామాలయ విరాళాల చోరీ



ఆనాడు సర్కార్ సొమ్ము భద్రాద్రి ఆలయానికి ఖర్చుపెట్టి జైలు పాలయ్యాడు భక్తరామదాసు. ఈనాడు అయోధ్య రామాలయం పేరు చెప్పి అధికారం దక్కించుకొన్న వారి అంతేవాసులే రాముడి సొమ్ము కైంకర్యం చేసి కటకటాలు లెక్కించడం విడ్డూరం. రథయాత్ర రాజకీయాలు ఆలయ నిర్మాణంతో క్లైమాక్స్‌కు చేరుకోవడం వరకు జరిగిన ఘటనల క్రమం బీజేపీ అంచెలంచెలుగా అధికార సోపానంపై ఎదగడానికి దోహదం చేశాయి. ఇప్పుడు అదే ఆలయంలో దేవుడి సొత్తును అదే బీజేపీ నియమించిన ట్రస్టీలు దిగమింగడం దారుణం. రామాలయం కోసం ఉద్యమం నడిపిన బీజేపీ ఆధ్వర్యంలోని పాలకులే గుడి కడుతున్నరంటే కోట్లాది మంది నమ్మారు. ధన, కనక, వస్తురూపేణా భూరిగా విరాళాలు సమర్పించుకొన్నారు. ఇప్పుడా నమ్మకం వమ్మయింది. ఏడెనిమిది కోట్ల రూపాయల విలువ చేసే నగదు, వెండి, బంగారు నగలు హుండీల నుంచి మాయమయ్యాయని అంటున్నారు. గుడిలో గుటకాయస్వాహా చేసిన సొమ్ము మొత్తం ఎంతో ఇదమిత్థంగా ఎవరికీ అంచనాలు లేవు. ఇది దోపిడీ దొంగల పని కాదు. ఆలయ నిర్వాహకులే ఓ పథకంప్రకారం సొత్తును బయటకు దాటించినట్టు తెలుస్తున్నది. దీనిపై మొదలైన దర్యాప్తు పర్యవసానంగా పెద్దసంఖ్యలో అరెస్టులు, భారీగా జప్తులు చోటుచేసుకోవడం, ట్రస్టీలు రాజీనామా చేయడం సంచలనం సృష్టించింది. దేశ రాజకీయాలకు కేంద్ర బిందువులా మారిన అయోధ్య ఆలయంలో కెమెరాల కన్నుగప్పి దుస్తుల్లో, కాలి మేజోళ్లలో దాచి హుండీసొత్తును తస్కరించడం నిఘావ్యవస్థ దారుణ వైఫల్యాన్ని పట్టిస్తున్నది. దర్యాప్తు జరుగుతున్న కొద్దీ రోజుకొకటిగా వెలుగు చూస్తున్న లోపాలు సంచలనం కలిగిస్తున్నాయి. హుండీ లెక్కింపు ఫుటేజీని 180 రోజులపాటు భద్రపర్చాల్సి ఉండగా 45 రోజుల పాటే అందుబాటులో ఉండటం వంటివి నిఘాను నిద్రపుచ్చడానికి అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. హుండీ సొమ్ము జమ చేసేందుకు ఎస్‌బీఐతో కుదుర్చుకొన్న ఒప్పందంలోని నిబంధనలు గాలికి వదిలేసి, తగిన భౌతిక తనిఖీలు జరుపకుండా, జేబులున్న దుస్తుల్లో వ్యక్తులను హుండీ లెక్కింపునకు అనుమతించడం విచిత్రం. ఇదంతా నిర్లక్ష్యమా లేక కావాలనే చేశారా? అని అనుమానం కలుగకమానదు. ఇప్పటివరకైతే ట్రస్టీలు, ఆలయ ఉద్యోగుల స్థాయిలోనే జవాబుదారీ బయటపడింది. అరెస్టయినవారు మౌలికంగా కింది స్థాయి ఉద్యోగులు. ట్రస్టీలు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. అధికారంలో ఉన్నవారి మిలాఖతు మాటేమిటనే ప్రశ్న సహజంగానే ఈ సందర్భంగా తలెత్తుతున్నది. మొదటి నుంచీ ఆలయ రాజకీయాలతో నెట్టుకువస్తున్న బీజేపీకి ఇప్పుడు ఆలయ చోరీ పంకిలం అంటుకున్నది. బీజేపీ పర్యవేక్షణలో భక్తుల విరాళాలకు భద్రత కరువు కావడమే అందుకు కారణం. ఇంతటి వైఫల్యం బయటపడ్డ తర్వాత కూడా కొందరు మోదీ భజనపరులు.. ఈ చోరీ పెద్ద విషయం కాదన్నట్టుగా వితండవాదనలు చేయడం మూర్ఖత్వం. అయోధ్య ఆలయంలో చోరీ ఉదంతంతో డబుల్ ఇంజిన్ సర్కార్ బడాయిల పస తేలిపోయింది. సీబీఐ దర్యాప్తును కోరుతూ దాఖలైన పిటిషన్లపై కేంద్రానికి, యూపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ట్రస్టుకు నోటీసులు ఇవ్వొద్దని రెండు ప్రభుత్వాల తరఫున వినిపించిన వాదనలను కొట్టేసింది. సిట్ నివేదికకు సర్కార్ విధించిన గడువు రేపటితో ముగుస్తుంది. ఆ నివేదికలో కొత్త సంగతులతో పాటుగా కొత్త పేర్లు బయటకు వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఎవరి వాటా ఎంత అనే సంగతి తర్వాత తేలుతుందో లేదో తెలియదు కానీ, ఒకటి మాత్రం నిజం. డబుల్ ఇంజిన్ సర్కార్ వాదనలోని చిత్తశుద్ధి, విశ్వసనీయతపై మరకలు పడ్డాయని చెప్పకతప్పదు. ఇంత జరుగుతున్నా దేశానికి చౌకీదార్‌ను అని చెప్పుకొనే ప్రధాని నరేంద్రమోదీ కనీసం నోరు విప్పలేదు. ఈ ఉదంతంలో రాముడి పేరిట రాజకీయాలు చేసిన బీజేపీ ప్రతిష్ట, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో, చాలావరకు దిగజారింది. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విపక్షాలకు ఈ ఆలయచోరీ శక్తిమంతమైన ఆయుధంగా మారుతున్నదనడంలో సందేహం లేదు.

# ఉద్యమకారులకు న్యాయం దక్కేనా?



అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాటలు నీటి మూటలేనని తేలిపోయింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులను కూడా మోసగించిం ది. అమరుల కుటుంబానికి ఒక ఉద్యోగం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి, సంక్షేమ చర్యలు చేపడుతామని మ్యానిఫెస్టోలో తెలిపింది. కానీ ముప్పై నెలలు పూర్తవుతున్నా అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇది రాష్ట్రప్రజల విశ్వాసానికి గట్టి దెబ్బ.ల ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు, ఉపకమిటీలు, అఖిలపక్ష సమావేశాలు, అభిప్రాయ సేకరణలు అంటూ కాలం గడుపుతున్నది. ఉద్యమకారులకు అవసరమైనవి కమిటీలు కాదు, నిర్ణయాలు. ప్రభుత్వం ఒకవైపు అందరికీ ఇవ్వలేం అంటున్నది. మరోవైపు ఉద్యమకారుల ఎంపికకు స్పష్టమైన విధానం ప్రకటించడం లేదు. అయితే మొదట గుర్తింపు రావాల్సింది అమరవీరుల కుటుంబాలకు. ఆ తర్వాత జైళ్లలో నెలల తరబడి ఉన్నవారికి, పోలీసు కేసులు ఎదుర్కొన్నవారికి, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోయిన విద్యార్థులకు, ఉద్యమంలో జీవితాన్ని అంకితం చేసిన కవులు, కళాకారులు, జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలా ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, ఒక్కరేమిటి అన్ని వర్గాలు తమ వృత్తిని వదిలి తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. ఇప్పటికే మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించ కుండా హామీలు అమలు చేస్తామని చెప్పడంలో చిత్తశుద్ధి కనిపించడంలేదు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్ ఏర్పాటు చేయాలి. ఉద్యమకారుల సంక్షేమ కార్పొరేషన్ స్థాపించి, ప్రతి ఏడాదీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. అమరవీరుల కుటుంబాలకు గౌరవ పెన్షన్, విద్య, వైద్యం, ఉపాధి, గృహ భరోసా కల్పించాలి. విద్యార్థి ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలు, వడ్డీ రహిత రుణాలు, పరిశ్రమల స్థాపనకు హామీ ఇవ్వాలి. కె.కేశవరావు కమిటీని కాలయాపన వేదికగా కాకుండా చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్‌గా మార్చాలి. తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధుల తరహాలో గౌరవించి, వారి సంక్షేమాన్ని ప్రభుత్వ శాశ్వత బాధ్యతగా స్వీకరించాలి. అమరవీరుల త్యాగాలను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి 611 మందికి ఉద్యోగాలు కల్పించి ఆర్థిక సహాయం చేసింది. ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు 550 ఉద్యోగాలు కల్పించింది. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చింది. చాలామందికి రాజకీయ పదవులు ఇచ్చింది. కానీ ప్రజలను, ఉద్యమకారులను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే. ఉద్యమ జేఏసీలో భాగస్వాములుగా ఉన్న మేం కేశవరావు కమిటీకి పలు సూచనలు చేశాం. 1969 ఉద్యమం నుంచి 2014 వరకు వివిధ రూపాలలో మరణించిన వారి జాబితా తయారు చేయాలి. ఉద్యమకారుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ. 25,000 పెన్షన్, గృహ వసతి కల్పించాలి. ఉద్యమంలో జైలుకు వెళ్లిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. నిర్బంధాల వలన వైకల్యం లేదా ఇతర సమస్యలు తలెత్తి, ఇబ్బందులు పడుతున్న వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలి. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, వారికి నాయకత్వం వహించిన సంఘాల బాధ్యులకు ప్రభుత్వ కార్యక్రమాలలో తగిన గౌరవం కల్పించాలి. ముఖ్యంగా ఆగస్టు 15, జనవరి 26, జూన్ 2 వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి దాటిన వారికి, విద్యార్హతలు లేని వారికి ప్రభుత్వం రుణాలు ఇప్పించాలి. వివిధ వ్యాపారాలలో స్థిరపడే అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. భారత ప్రభుత్వం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారికి పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నది. వాటిని పరిశీలించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి న్యాయం జరిగేలా కృషి చేయాలి. జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి సమకూర్చిన సంక్షేమాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి. చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉద్యమకారుల సంక్షేమం నిరంతర ప్రక్రియగా ఉండాలి. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. తెలంగాణ వైతాళికుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి. ఉద్యమకారులకు వైద్య సదుపాయం కల్పించాలి. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమంపై విషం చిమ్ముతున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వాలి, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేసి ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలి. భారత స్వాతంత్ర్య సమరయోధులకు కల్పించిన తరహాలోనే తెలంగాణ ఉద్యమకారులకు కూడా అన్ని సంక్షేమ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలి.

## బీజేపీకి చుక్కలు చూపిస్తున్న పీకే

**పాట్నా :** బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే పేరు మార్మోగుతోంది.. అదే ప్రశాంత్ కిషోర్ . మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి అజేయమైన కోటగా ఉన్న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకే ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం, అక్కడ పొలిటికల్ మైండ్ గేమ్‌తో కమల దళానికి ఆయన చుక్కలు చూపిస్తున్నారు. నామినేషన్ వేసిన కేవలం 24 గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి అభిషేక్ సిన్హా అర్ధాంతరంగా బరి నుంచి తప్పుకున్నారు. ఒకప్పుడు తెరవెనుక ఉండి దేశవ్యాప్తంగా ఎందరో నాయకులను గెలిపించిన ఈ కింగ్‌మేకర్, ఇప్పుడు తానే నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.బంకీపూర్ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిషోర్ స్వయంగా నిలబడటంతో బీజేపీ తీవ్ర ఆత్మరక్షణలో పడింది. పీకే లాంటి చాణక్యుడి ముందు అభిషేక్ సిన్హా చాలా బలహీనమైన అభ్యర్థి అని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలడమే కాకుండా, ఆయనకు సంబంధించిన కొన్ని వివాదాస్పద ఆర్థిక లావాదేవీల చిట్టా పీకే చేతికి చిక్కిందనే ప్రచారం పట్నా రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ ఆధారాలు ఎన్నికల ప్రచారంలో బయటపడితే పార్టీ పరువు గంగలో కలుస్తుందని భావించిన అధిష్టానమే, బంటితో బలవంతంగా నామినేషన్ ఉపసంహరింపజేసింద భావిస్తున్నారు. ఈ పరిణామంతో, ప్రత్యర్థులను ఈడీ, సీబీఐలతో భయపెట్టే బీజేపీ.. ఇప్పుడు ఓటమి భయంతో తానే రంగు మార్చి పారిపోతోందంటూ పీకే వేసిన సెటైర్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.నష్టనివారణ చర్యల్లో ఓ బీజేపీ యువజన విభాగంలో పనిచేసే నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థిగా అత్యవసరంగా బరిలోకి దించింది. ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ స్థానం, కమలదళానికి అత్యంత ప్రతిష్టాత్మకం. గత 2025 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారిపై నితిన్ నవీన్ 51 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే, ఇప్పుడు పీకే స్వయంగా రంగంలో ఉండటం, ఆర్జేడీ తరఫున మళ్లీ రేఖా కుమారి పోటీలో నిలవడంతో ఈ ఉపఎన్నిక రసవత్తరమైన త్రిముఖ పోరుగా మారింది.జులై 30న జరగబోయే పోలింగ్, ఆగస్టు 3న వచ్చే ఫలితాలను ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ భవిష్యత్తుకు ఒక రెఫరెండం గా ప్రకటించారు. మొదటి విడతలోనే అభ్యర్థిని మార్చాల్సి వచ్చేలా చేసి బీజేపీ డిఫెన్స్‌లో పడిందనే నెరేటివ్‌ను సెట్ చేయడంలో పీకే ఇప్పటికే సగం విజయం సాధించారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన (డెడ్ లాక్) ఏర్పడిందనే వార్తలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఖండించారు. "ఆ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేవి" అని పేర్కొన్నారు. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకునేందుకు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి బదులుగా, మరింత మెరుగైన ఒప్పందం కోసం భారత్ చర్చలను ఆలస్యం చేస్తోందని ఒక అంతర్జాతీయ వార్త సంస్థ కథనాన్ని ప్రచురించింది. దీనిన్ని పీయూశ్ గోయల్ ఎక్స్ వేదికగా ఖండించారు. ఆ వార్త పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేది అని అన్నారు. జూన్ నెలలో యూఎస్ వాణిజ్య ప్రతినిధి (యూఎస్?టీఆర్) జేమీసన్ గ్రీర్ దిల్లీ సందర్శించినప్పుడు ఆయనతో 'ఫెంటాస్టిక్ మీటింగ్స్?' జరిగాయని తెలిపారు. ఇరుదేశాలు సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు.

"జూన్ నెలలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసర్ గ్రీర్? దిల్లీ వచ్చినప్పుడు ఆయనతో అద్భుతమైన సమావేశాలు జరిపాను. ఇరుదేశాల్లోని వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలను అందించే, వాణిజ్యపరంగా అర్థవంతమైన, సమతుల్యమైన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి మా బృందాలు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాయి" అని గోయెల్ పేర్కొన్నారు. భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందానికి



ఎలాంటి అడ్డంకులు లేవని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్ తెలిపిన తర్వాత కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

**అంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది!**

2026 జూన్? వాణిజ్య గణాంకాలపై మీడియా ప్రతినిధులతో మాట్లాడిన రాజేశ్ అగర్వాల్?, భారత్?-అమెరికా ట్రేడ్ డీల్? చర్చల్లో తమకు ఎలాంటి సవాళ్లు కనిపించలేదని పేర్కొన్నారు. "భారత బృందం మే నెలలో అమెరికాను సందర్శించింది. యూఎస్? బృందం జూన్?లో భారత్?కు వచ్చింది. చర్చలు సరైన పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. అమెరికా సుంకాల (టారిఫ్స్?) బాదుడు చర్యలపై చాలా మంది భాగస్వాములకు అనిశ్చితి ఉంది. అయితే ఇప్పుడు ఐఈఈపీఏ సుంకం ముగిసింది. అమెరికా వాళ్లు ఇప్పుడు మళ్లీ ఇతర దేశాలతో చర్చలు జరుపుతున్నారు. భారత్ కూడా ఆ చర్చల్లో భాగస్వామిగా ఉంది. ఈ వాణిజ్య ఒప్పందంపై చర్చలన్నీ సరైన దిశలోనే వెళ్తున్నాయి. ఇప్పటికే డీల్ ఫ్రేమ్?వర్క్? ఖరారైంది. మేము ఈ ట్రేడ్ డీల్?పై సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ప్రాథమిక పనులన్నీ పూర్తయ్యాయి. సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం. అన్నీ ఒక క్రమపద్ధతిలో జరుగుతాయి. మేము మంచి పురోగతి సాధిస్తాం. ఈ వాణిజ్య ఒప్పందంపై భారత్?, అమెరికా ప్రభుత్వాలు చాలా సానుకూల ధోరణిని కనబరుస్తున్నాయి" అని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్? చెప్పారు. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ట్రేడ్ ఫ్లో (వాణిజ్యం) బలంగా కొనసాగుతోందని అగర్వాల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు ఉన్నప్పటికీ, వస్తు, ఉత్పత్తుల మార్పిడిలో నిరంతర వేగం కొనసాగుతోందని అన్నారు. అయితే భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే తేదీని కానీ , కాలక్రమాన్ని కానీ ఆయన చెప్పలేదు.

**ఒప్పందం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాం!**

ఇంతకు ముందు భారత్ పర్యటనకు వచ్చిన గోర్? మాట్లాడుతూ, "ఈ వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది. దాదాపు మొత్తం చర్చలు పూర్తయ్యాయి. కేవలం ఒక శాతం అంశాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ చర్చలకు ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఇరు దేశాల మధ్య గత రెండు దశాబ్దాలుగా విస్తృత స్థాయిలో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. మేము దాదాపు ఏడాదిన్నరగా ఈ ఒప్పందంపై పనిచేస్తున్నాం. దీన్ని విజయవంతంగా ముగించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని గోర్ అన్నారు.

# ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. టీనేజీ వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ఝూజూూ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి టీనేజ్ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైందా అనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం-యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ 'ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్లిపోకుండా ప్రభుత్వం లేదా వ్యవస్థ ఎలా అడ్డుకోగలదు? పిల్లలపై జరిగే లైంగిక దాడులు, దోపిడీని అరికట్టేందుకే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అనేది సులభంగా ముప్పునకు లేదా ప్రభావానికి లోనయ్యే వయసు. ప్రయోగాలు చేసే సున్నితమైన దశ. అలాంటప్పుడు ప్రతి ప్రేమ వ్యవహారాన్ని పోక్సో కేసుగా ఎలా మారుస్తారు?' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 2023లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పులో యువతులు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు 2024లో ఆ తీర్పును రద్దు చేసి, యుక్త వయస్కుల గోప్యత హక్కుల అంశంపై సుమోటో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం అదే కేసు విచారణ కొనసాగుతోంది.



**'తల్లిదండ్రులు పరువు కోసం క్రిమినల్ కేసులు పెడుతున్నారు'**

విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ఈ కేసు నేపథ్యాన్ని వివరించారు. ఒక మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో స్వచ్ఛందంగా వెళ్లి ప్రస్తుతం అతనితో కలిసి జీవిస్తూ, వారికి ఒక బిడ్డ కూడా ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. పోక్సో చట్టం కారణంగా ఇలాంటి సంబంధాల్లో ఉన్న యువకులు జైలుకు వెళ్లాల్సి వస్తోందని ఆమె వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం '16 నుంచి 18 ఏళ్ల మధ్య యువత ప్రేమలో పడి కలిసి వెళ్లిపోతారు. కుటుంబ పరువును కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది.

2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సమ్మతి వయసును 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు పెంచారని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. అయితే టీనేజీ ప్రేమ సంబంధాలు 2012 తర్వాత మాత్రమే మొదలయ్యాయని చెప్పలేమని, ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉండేవని పేర్కొంది. బాల్య వివాహాలు కూడా గతంలో సాధారణమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే చట్టం మారడంతో ఇప్పుడు అలాంటి సంబంధాలు నేర పరిధిలోకి వచ్చాయని వివరించింది.

**పోక్సో కేసుల పర్యవేక్షణపై సూచనలు**

పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం అని మాధవి దివాన్ అభిప్రాయపడ్డారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కేసుల్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోక్సో చట్టం అమలుకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు జులై 17కు వాయిదా వేసింది.

**బహిరంగ ప్రదేశాల్లో పోర్న్ చూడటంపై నిషేధించాలి!- కోర్టు ఏం చెప్పిందంటే?**

బహిరంగ ప్రదేశాల్లో అశ్లీల (పోర్నోగ్రఫీ) వీడియోలు, కంటెంట్ చూడటాన్ని నిషేధించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరుతూ దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (ౄఖూ) సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ అంశం న్యాయపరమైనది కాదని, విధానపరమైన నిర్ణయాలకు సంబంధించినదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ అంశం ప్రాధాన్యత కలిగినదేనని అంగీకరించినప్పటికీ, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అని పేర్కొంది.

# 'ఎస్-500' వచ్చేస్తోంది..!

భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర' కోసం రష్యా ఒక అసాధారణమైన ప్రతిపాదనను భారత్ ముందు ఉంచింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతన వాయు రక్షణ వ్యవస్థగా పేరొందిన 'ఎస్-500' ఆధారిత సాంకేతికతను భారతదేశంతో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయడానికి మాస్కో సిద్ధంగా ఉన్నట్లు రష్యా వర్గాలను ఉటంకిస్తూ 'ఐడిఆర్‌డబ్ల్యూ' పేర్కొంది. నిజానికి ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఏర్పడిన అంతర్గత భద్రతా అవసరాల దృష్ట్యా, గతంలో ఎస్-500 వ్యవస్థను నేరుగా భారతదేశానికి విక్రయించడానికి రష్యా నిరాకరించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, నేరుగా విక్రయించే బదులు.. ఎస్-500 సామర్థ్యాలను భారతదేశంతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి మొగ్గు చూపింది. రష్యా నుంచి వచ్చిన ఈ ప్రతిపాదన భారతదేశపు ప్రస్తుత, భవిష్యత్ బహుళ అంచెల వాయు రక్షణ నిర్మాణాన్ని మరింత శక్తివంతం చేయనుంది.

**ఏమిటీ సుదర్శన్ చక్ర ప్రాజెక్ట్?**

భారతదేశం తన సొంత గగనతల రక్షణ అవసరాల కోసం 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'ను అభివృద్ధి చేస్తోంది. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థ మాత్రమే కాదు; సుదూర ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా సెన్సార్లు, అత్యాధునిక రాడార్లు, కమాండ్-అండ్-ంట్రోల్ నెట్‌వర్క్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే ఒక సమీకృత నెట్‌వర్క్. ఇది ఇప్పటికే భారత్ వద్ద ఉన్న రష్యన్ ఎస్-400 వ్యవస్థతో పాటు, స్వదేశీ వాయు రక్షణ ప్రాజెక్ట్ 'కుషా' లతో కలిసి సమన్వయంతో పనిచేస్తుంది.



**తిరుగులేని భారత్ శక్తి**

రష్యాకు చెందిన ఎస్-400 కంటే ఎస్-500 ఎంతో అధునాతనమైనది. ఈ సాంకేతికత తోడైతే, భారత రక్షణ వ్యవస్థ శత్రుదేశాల విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, అత్యంత వేగంగా దూసుకొచ్చే హైపర్‌సోనిక్ ఆయుధాలను సైతం గాల్లోనే తుత్తునియలు చేయగలదు. అంతేకాకుండా, మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో పాటు, కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల స్టెల్త్ ఫైటర్ జెట్‌లను కూడా ఇది గుర్తించి కూల్చివేయగలదు.

**వ్యూహాత్మక ప్రాధాన్యత -- టెక్నాలజీ బదిలీ**

బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనేందుకు భారత్ ఇప్పటికే స్వంత మార్గసూచితో బాలిస్టిక్ క్షిపణి రక్షణ ఫేజ్-× ను మోహరించింది. ఇది అంతరిక్షం వెలుపల, వాతావరణం లోపల వచ్చే క్షిపణులను అడ్డుకుంటుంది. ఇలాంటి తరుణంలో రష్యా ప్రతిపాదన భారత్‌కు అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే, ఈ ప్రతిపాదన కేవలం ఆయుధాల కొనుగోలుకు పరిమితం కాకుండా, అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యత ఇస్తుంది.

**చిరకాల మైత్రికి నిదర్శనం**

ఒకప్పుడు కేవలం ఆయుధాల విక్రయదారుడిగా ఉన్న రష్యా, ఇప్పుడు భారతదేశపు సమీకృత వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా మారడానికి సిద్ధపడటం ఇరు దేశాల చిరకాల మైత్రికి, వ్యూహాత్మక బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే భారత గగనతలం వైపు కన్నెత్తి చూడటానికి కూడా శత్రుదేశాలు వణకక తప్పదు.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్..?



ఇరాన్‌లో ఓ ప్రముఖ వార్తాపత్రిక ప్రచురించిన కథనం అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక 'హిట్‌లిస్ట్'ను ఆ పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే 'హమ్‌షహ్రీ' అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. "ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు.. మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారు" అని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. 'హమ్‌షహ్రీ' పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ.. తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.

## బిజినెస్

### హెచ్‌సీఎల్ టెక్ రూ.12 డివిడెండ్




**న్యూఢిల్లీ :** హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.4,624 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 20 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14 శాతం అధికమై రూ.34,576 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది. ఈ సందర్భంగా కంపెనీ చైర్‌పర్సన్ రోష్నీ నాడర్ మల్హోత్రా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ పరివర్తనను ఏఐ వేగవంతం చేస్తున్నదని, దీంతో కంపెనీ కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. క్లయింట్లకు తమ వ్యాపార వ్యూహాలను ముందుకు నడిపించడానికి నూతన సాంకేతిక సేవలను అందిస్తున్నట్టు, అలాగే ఉద్యోగులను ఈ నూతన టెక్నాలజీ నైపుణ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు చెప్పారు. గత త్రైమాసికంలో కొత్తగా 2.4 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 1-4 శాతంగా ఉంటుందని గైడెన్స్‌లో పేర్కొంది.

### టెస్టింగ్‌ఎక్స్‌పర్ట్స్ నూతన డెలివరీ సెంటర్



**హైదరాబాద్ :** ప్రపంచంలో మూడో అతిపెద్ద క్వాలిటీ ఇంజినీరింగ్ అండ్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ కంపెనీ టెస్టింగ్ ఎక్స్‌పర్ట్.. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగం గా హైదరాబాద్‌లో సరికొత్త డెలివరీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విడతగా 300 సీట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక కేంద్రం.. భవిష్యత్తులో 2,500 సీట్లకు పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో మనీష్ గుప్తా తెలిపారు. భవిష్యత్తులో ఈ డెలివరీ సెంటర్‌ను ఇన్నోవేషన్ సెంటర్‌గా మార్చబోతున్నట్టు ప్రకటించారు. ప్రతిభ కలిగినవారికి మెరుగైన ఉద్యోగావకాశాలనిస్తామన్నారు.

# ద్రవ్యోల్బణం రయ్.. రయ్

## పరుగులు పెడుతున్న రిటైల్ ధరల సూచీ

**జూన్‌లో 4.38 శాతంగా నమోదు**

**తారెత్తిస్తున్న ఆహారోత్పత్తుల రేట్లు**

**రాష్ట్రాల్లో తెలంగాణే టాప్**




**న్యూఢిల్లీ :** రిటైల్ ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ధరల కట్టడికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పెట్టుకున్న మధ్యస్త లక్ష్యం 4 శాతాన్ని మించి గత నెలలో నమోదైంది. జూన్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉన్నట్టు సోమవారం జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) విడుదల చేసిన గణాంకాల్లో తేలింది. ఈ ఏడాది ఆరంభం నుంచేగాక, కొత్తగా వచ్చిన సిరీస్‌లోనూ గరిష్ఠ స్థాయి ఇదే కావడం గమనార్హం. అంతకుముందు నెల మేలో 3.93 శాతంగా ఉన్నది.

**ఆహార ద్రవ్యోల్బణం దెబ్బ**

ఆహారోత్పత్తుల రేట్లు ఆకాశమే హద్దుగా పరుగులు పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆహార ద్రవ్యోల్బణం సూచీ జూన్‌లో 5.32 శాతంగా నమోదైంది. మే నెలలో 4.78 శాతంగా ఉన్నది. కాగా, అల్లం, టమాటా, కిస్మిస్ ధరలు విపరీతమైపోయాయని తేలింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.74 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 3.92 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో ఈ సందర్భంగా వివరించింది. అలాగే రాష్ట్రాలవారీగా తెలంగాణలో ద్రవ్యోల్బణం అత్యధికం (6.36 శాతం)గా, మిజోరాంలో అత్యల్పం (1.63 శాతం)గా ఉన్నట్టు పేర్కొన్నది. కాగా, ఎల్ నినో కారణంగా వర్షాలు దేశవ్యాప్తంగా విస్తారంగా కురవడం లేదు. దీంతో ఈసారి పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు సమృద్ధిగా కురవకపోతే ఆహార ద్రవ్యోల్బణం కట్టడి దాదాపు అసాధ్యమేనని వ్యవసాయ రంగ నిపుణులు చెప్తుండటం ఇప్పుడు కలవరపాటుకు గురిచేస్తున్నది. అసలే పశ్చిమాసియా సంక్షోభం వల్ల భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతున్నదని, ఇప్పుడు వర్షాభావ పరిస్థితులతో ఎకానమీ ఇంకా దెబ్బతినవచ్చని హెచ్చరిస్తున్నారు.

**ఈసారి వడ్డింపులే..!**

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతంలోపే ఉంచాలన్నది ఆర్బీఐ లక్ష్యం. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ 6 శాతాన్ని మించకుండా చూడాలన్నదే సెంట్రల్ బ్యాంక్ ధ్యేయం. అయితే ఇప్పుడు ఆర్బీఐ టార్గెట్‌ను మించి జూన్ నెల ధరల సూచీ నమోదైంది. దీంతో రాబోయే ద్రవ్య సమీక్షల్లో కీలక వడ్డీరేట్ల పెంపు ఉండవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారంలో ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష జరుగబోతున్నది. ఈ సందర్భంగా రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంచే వీలుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు ప్రియం కానున్నాయి. ఆయా రుణాలను తీసుకున్నవారిపై, తీసుకోవాలనుకునేవారిపై వడ్డీ భారం పెరుగుతుంది. అంతేగాక ఆటో, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ రంగాల వ్యాపారం కూడా ప్రభావం కాగలదు. ఈ క్రమంలోనే పశ్చిమాసియా సంక్షోభం వేళ ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే.. దేశ జీడీపీ వృద్ధిరేటు దెబ్బ తింటుందన్న ఆందోళనలూ కనిపిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలుగుతున్నది చూస్తూనే ఉన్నాం. సరుకు రవాణాకు కీలకమైన హొర్ముజ్ జలసంధిలో అలజడులు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల్ని పెంచేస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు, ఇరాన్ తమ పొరుగు దేశాలపై ప్రతిదాడులతో ఇప్పట్లో మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టేలా లేవు. ఈ నేపథ్యంలో దిగుమతుల ద్వారానే దాదాపు 90 శాతం ఇంధన అవసరాలను తీర్చుకుంటున్న భారత్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. పెట్రో ధరలు ఇంకా పెరిగితే ద్రవ్యోల్బణం రాబోయే నెలల్లో మరింత పెరిగే సంకేతాలే కనిపిసున్నాయని అంటున్నారంతా.

**ధరల్లో తెలంగాణ తగ్గేదేలే..**

తెలంగాణలో అధిక ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జాతీయ ద్రవ్యోల్బణం గణాంకాలను మించి రాష్ట్రంలో నమోదవుతున్నాయి. నిజానికి గత కొంతకాలంగా పరిస్థితి ఇలాగే ఉంటున్నది. జూన్‌లోనూ దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా తెలంగాణ రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డైంది. గత నెలైతే ఏకంగా 6.36 శాతంగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ తాజా అధికారిక లెక్కలు చెప్తున్నాయి. పైగా గడిచిన 3 నెలలుగా నెలనెలా ద్రవ్యోల్బణం రేటు పెరుగుతూనే ఉన్నది. ఇక ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తెలంగాణలో నమోదైన ద్రవ్యోల్బణం గణాంకాలే రాష్ట్రాలవారీగా చూసినైట్టైతే టాప్‌లో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఆహారోత్పత్తుల ధరలు తారెత్తిస్తున్నాయి. ఫలితంగా పేద, సగటు మధ్య తరగతి కుటుంబాల వంటింటి బడ్జెట్ తలకిందులైపోతున్నది. దాదాపు అన్ని కూరగాయల రేట్లు కిలో రూ.60-120 స్థాయిలో ఉన్నాయి మరి. పప్పు ధాన్యాలు, వంట నూనెలు, ఇతర ఆహారోత్పత్తుల పరిస్థితీ ఇలాగే ఉన్నది. దీంతో ధరల అదుపులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి

### వాణిజ్య లోటు పైపైకి..

### గత నెలలో 5 నెలల గరిష్ఠానికి చేరిక

**జూన్‌లో 30.43 బిలియన్ డాలర్లుగా నమోదు**

**న్యూఢిల్లీ :** దేశంలో ఎగుమతులను మించి దిగుమతులవుతున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు అంతకంతకు పెరుగుతూపోతున్నది. ఈ క్రమంలోనే జూన్‌లో 5 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 30.43 బిలియన్ డాలర్లుగా నమోదైంది. నిరుడు జూన్‌లో 19.1 బిలియన్ డాలర్లే. అయితే ఈ ఏడాది జనవరిలో 34.68 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఆ తర్వాత ఆ స్థాయిలో నమోదవడం ఇదే తొలిసారి. కాగా, అధిక ముడి చమురు ధరలే ఇందుకు కారణమని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. గత నెల దేశీయ క్రూడాయిల్ దిగుమతులు 19.32 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతంతో పోల్చితే 40 శాతం పెరిగాయి. జూన్‌లో ఇతర దేశాలకు దేశం నుంచి 40.41 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. మునుపటితో చూస్తే 15.5 శాతం వృద్ధి కనిపించింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో 15.92 శాతం పుంజుకొని 129.32 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 19.89 శాతం పెరిగి 216.18 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఫలితంగా ఈ మూడు నెలల్లో వాణిజ్య లోటు 86.86 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 68.75 బిలియన్ డాలర్లే. కాగా, గత నెలలో ఎలక్ట్రానిక్స్, ఐరన్ ఓర్, హస్తకళలు, మాంసం, పాల ఉత్పత్తుల ఎగుమతులు ఆకర్షణీయంగా జరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఈ సందర్భంగా తెలిపారు.

**అమెరికాతో..**

భారత్ నుంచి అమెరికాకు జూన్‌లో ఎగుమతులు 1.21 శాతం తగ్గిపోయాయి. 8.17 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అయితే దిగుమతులు మాత్రం 33.86 శాతం ఎగిసి 5.5 బిలియన్ డాలర్లకు చేరాయి. నిరుడు జూన్‌లో ఎగుమతులు 8.27 బిలియన్ డాలర్లు, దిగుమతులు 4.11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక ఈ ఏప్రిల్-జూన్‌లో ఎగుమతులు 25.46 బిలియన్ డాలర్లుగా ఉంటే, దిగుమతులు మాత్రం 23.82 శాతం ఎగబాకి 16.65 బిలియన్ డాలర్లను తాకాయి.

# భారత్ ఆట మారేనా..

## నేడు ఇంగ్లండ్‌తో తొలి వన్డే.. రోకోపై భారీ అంచనాలు




**బర్మింగ్‌హామ్ :** టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత వరుసగా రెండు సిరీస్‌ల్లో ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురై తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత్ ఇప్పుడు వన్డే ఫార్మాట్ పోటీకి రెడీ అయింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగే తొలి పోరులో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో షార్ట్ ఫార్మాట్‌లో పూర్తిగా తేలిపోయిన భారత్.. వన్డేల్లో అయినా తన ఆటను, రాతను మెరుగు పరుచుకోవాలని చూస్తోంది. ఉపఖండంతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన, సవాల్ విసిరే వికెట్లపై జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ పేస్ దెబ్బకు షార్ట్ ఫార్మాట్‌లో అయ్యర్ అండ్ కో ఆపసోపాలు పడింది. వన్డేల్లోనూ భారత్‌కు వీళ్ల నుంచి ముప్పు తప్పదు. కానీ, వెటరన్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో పాటు టీ20 సిరీస్‌కు రెస్ట్ తీసుకున్న పేస్ లీడర్ జస్‌ప్రీత్ బుమ్రా చేరిక జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. 'రోకో'తో పాటు ఈ ఫార్మాట్‌లో చెలరేగిపోతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మరో సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్‌పై జట్టు భారీ అంచనాలు పెట్టుకుంది. టీ20 కెప్టెన్‌గా తేలిపోయినప్పటికీ బ్యాటర్‌గా మెప్పించిన అయ్యర్ కూడా బరిలో ఉండటంతో బ్యాటింగ్ విభాగంలో పెద్దగా సమస్యలు కనిపించడం లేదు. కానీ, బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ బౌలింగ్ విభాగానికి సవాళ్లు తప్పేలా లేవు. సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌పై సత్తా చాటిన కొత్త పేసర్ గుర్నూర్ బ్రార్‌కు ఇంగ్లండ్ పరిస్థితుల్లో ఏమేరకు రాణిస్తాడన్నది ఆసక్తికరం. లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ తన బౌలింగ్‌లో మరింత వైవిధ్యం చూపెట్టాల్సిన అవసరం ఉంది. హార్దిక్ పాండ్యా, నితీశ్ రెడ్డి గైర్హాజరీలో శివమ్ దూబె నాలుగో పేసర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక, టీ20 సిరీస్‌లో సుందర్, అక్షర్ పటేల్ బ్యాట్, బాల్‌తో పూర్తిగా విఫలమవడం ఆందోళన కలిగిస్తోంది. చైనామన్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌పై ఎక్కువ భారం పడనుంది. మరోవైపు టీ20 సిరీస్ గెలుపు జోరును వన్డేల్లోనూ కొనసాగించాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది. కెప్టెన్ బ్రూక్, బట్లర్, బెథెల్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. వెటరన్ బ్యాటర్ జో రూట్ చేరికతో బ్యాటింగ్ విభాగం మరింత బలోపేతం అయింది. అయితే, జనవరిలో శ్రీలంక టూర్ తర్వాత ఇంగ్లిష్ టీమ్ వన్డే ఫార్మాట్ ఆడకపోవడం భారత్‌కు కాస్త కలిసొచ్చే అంశం.

### రువాండా ర్యాలీ విన్నర్ నవీన్



**హైదరాబాద్ :** భారత ర్యాలీ రేసర్, హైదరాబాద్‌కు చెందిన పులిగిళ్ల నవీన్ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటాడు. ఎఫ్ఐఏ ఆఫ్రికన్ ర్యాలీ చాంపియన్‌షిప్ (ఏఆర్‌సీ) మూడో రౌండ్ రువాండా మౌంటైన్ గొరిల్లా ర్యాలీలో విజేతగా నిలిచాడు. సోమవారం ముగిసిన ఈ రేస్‌లో భారత్‌కే చెందిన కో డ్రైవర్ మూసా షరీఫ్‌తో కలిసి టీమ్ డ్యూరాన్ రేసింగ్ తరఫున బరిలోకి దిగిన నవీన్ ఏఆర్‌సీ3 కేటగిరీలో ట్రోఫీ అందుకున్నాడు. ఫోర్డ్ ఫియస్టా ర్యాలీ3 కారుతో నవీన్-మూసా కఠినమైన గ్రావెల్ రోడ్లపై గంటకు 170 కిమీ వేగంతో దూసుకెళ్లారు. మొత్తం 18 స్పెషల్ స్టేజ్‌లలో 12 చోట్ల విజయం సాధించి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ 2 గంటల 13 నిమిషాల 48.3 సెకండ్లలో ర్యాలీని పూర్తి చేశారు. ఈ విజయంతో నవీన్, మూసా ఏఆర్‌సీ3 చాంపియన్‌షిప్ పట్టికలో రెండో స్థానానికి ఎగబాకారు.

## స్పోర్ట్స్

### ఫ్రాన్స్‌ను ఆపతరమా..


### నేడు స్పెయిన్‌తో సెమీఫైనల్

**ఎంబాపె, యమాల్‌పై అందరి దృష్టి**

**అ. రా. 12.30 నుంచి యునైట్ 8 స్పోర్ట్స్ , జీ5లో లైవ్**



**ఆర్లింగ్టన్ (యూఎస్ఏ) :** సాకర్ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న ఫిఫా ప్రపంచకప్‌లో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. 48 జట్లతో మొదలైన టోర్నీలో మిగిలిన నాలుగు జట్లు సెమీస్ సమరానికి రెడీ అయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి జరిగే తొలి సెమీస్‌లో బలమైన ఫ్రాన్స్, స్పెయిన్ తలపడనున్నాయి. రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్.. యూరోపియన్ చాంప్ స్పెయిన్ ను ఢీకొట్టనుండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె, స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ మధ్య పోరు అభిమానులకు అసలైన మజా అందించనుంది. గత ఎడిషన్‌లో కొద్దిలో ట్రోఫీ చేజార్చుకున్న ఫ్రాన్స్ ఈసారి ఎలాగైనా కప్పు నెగ్గాలన్న కసితో అసాధారణ ఆటతీరును కనబరుస్తోంది. ఆ జట్టు ఎటాకింగ్ విభాగం అద్భుత ఫామ్‌లో ఉంది. కెప్టెన్ ఎంబాపె ఐదు మ్యాచ్‌ల్లోనే 8 గోల్స్ సాధించి గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఉస్మాన్ డెంబెలే 5 గోల్స్ సాధించగా, మైఖేల్ ఒలిసే ఐదు అసిస్ట్‌లతో రాణించాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే వరుసగా మూడుసార్లు ఫైనల్ చేరిన రెండో యూరోపియన్ జట్టుగా ఫ్రాన్స్ రికార్డు సృష్టిస్తుంది. మరోవైపు, స్పెయిన్ బలమైన డిఫెన్స్, కంట్రోల్‌తో కూడిన ఆటతీరుతో దూసుకుపోతోంది. ఈ టోర్నీలో ఒకే ఒక్క గోల్ క్వార్టర్స్‌లో బెల్జియంకు ఇచ్చుకుంది. రోడ్రి, పెడ్రి, డాని ఓల్మో వంటి ఆటగాళ్లతో మిడ్‌ఫీల్డ్ బలంగా కనిపిస్తోంది.




# ‘దండోరా’ దర్శకుడితో సినిమా?

గత కొంతకాలంగా సరైన విజయాలు లేక నిరుత్సాహంలో ఉన్నారు హీరో నితిన్. గత ఏడాది విడుదలైన ‘తమ్ముడు’ కూడా పరాజయంపాలైంది. వరుస ఫెయిల్యూర్స్‌తో సినిమాలకు ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న నితిన్.. ఇటీవలే మూడు సినిమాలకు ఓకే చెప్పిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని తెరకెక్కించబోతున్నారు. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తాడు. ‘దండోరా’ తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగే సినిమా ఇదని సమాచారం. ఇందులో నితిన్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటించబోతున్నది. గ్లామర్ హంగులకు దూరంగా పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

# నాగచైతన్య కొత్త సినిమా?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ‘బెదురులంక 2012’ చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే ‘మసూద’ దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా ‘మసూద’తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.






# మా అమ్మ భావోద్వేగానికి గురయ్యారు: భాగ్యశ్రీ బోర్సే

“లెనిన్’ సినిమా విజయం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. నేను చేసిన భారతి పాత్ర పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం మర్చిపోలేను. ‘లెనిన్’లో నా నటన పట్ల మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. మా అమ్మగారు నాకు ఫోన్ చేసి, ‘సినిమా చాలా బాగుంది.. నీ నటన కూడా ఎంతో బాగా అనిపించింది’ అన్నారు. అయితే భారతి పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా భావోద్వేగానికి గురయ్యారు. ఎందుకంటే అలాంటి ముగింపును ఏ తల్లి కూడా కోరుకోదు కదా?” అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు. అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం ‘లెనిన్’. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో భారతి పాత్ర పోషించిన భాగ్యశ్రీ బోర్సే చెప్పిన విశేషాలు...

“లెనిన్’ కథని మురళీ కిషోర్‌గారు చెప్పినప్పుడే నా మనసుకు హత్తుకుంది. భారతి పాత్రలో నటనకు మంచి అవకాశం ఉందని అప్పుడే అనిపించింది. ఇప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రను ఇంతగా అభిమానించడం చాలా సంతోషంగా ఉంది. భారతి పాత్ర గురించి అందరూ ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నారు. నాగార్జునగారు నా నటన గురించి మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసలు నాకు సంతోషంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయి. ఋలెనిన్--భారతిల ప్రేమకథే ‘లెనిన్’. అఖిల్, నా పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. భవిష్యత్తులో మహారాణి, యువరాణి వంటి పాత్రలు చేయాలని ఉంది. అలాంటి చిత్రాల విషయంలో రాజమౌళిగారు మాస్టర్. ఏదో ఒక రోజు ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. ‘మా ఇంటి బంగారం’ సినిమాలో సమంతగారు అద్భుతంగా నటించారు. మాలాంటి కొత్త నటీమణులకు ఆమె ఒక దారి చూపించారు. అవకాశం వస్తే అలాంటి మహిళా ప్రధాన పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం శివ కార్తికేయన్ తో తమిళంలో ‘సీయోన్’ సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగు, తమిళ భాషల్లో మరికొన్ని కథలు వింటున్నాను. వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967